
మినీ భారత్ C/o గాజువాక





నమస్తే..
నమస్కార్..
వణక్కం..
ఆదాబ్..
సత్ శ్రీ అకాల్..

ఇలా పలు భాషల సమ్మేళనం.. విభిన్న సంస్కృతుల సమాహారం కనిపించే ప్రాంతం గాజువాక. పంచాయతీగా ఉన్న ఈ గ్రామం భారీ పరిశ్రమలు, వ్యాపారాలు, రవాణాకు కేంద్ర బిందువుగా మారింది. పారిశ్రామిక నగరంగా ఎదిగింది. దేశంలోని అనేక రాష్ట్రాల ప్రజానీకానికి ఆశ్రయమిచ్చింది. దాదాపు లక్ష కోట్ల రూపాయల పెట్టుబడులతో ప్రభుత్వరంగం ఇక్కడ సుస్థిరమైంది. అనుబంధ పరిశ్రమలు, ఆటోనగర్‌లో యూనిట్లు వేలాది మందికి ఉపాధి కల్పిస్తున్నాయి. దినసరి కూలీల నుంచి పారిశ్రామిక వేత్తలకు నిలయంగా మారింది గాజువాక. **– గాజువాక**

- పల్లె నుంచి పారిశ్రామిక నగరంగా గుర్తింపు
- దేశంలో అన్ని ప్రాంతాల ప్రజలకు ఆవాసం
- భారీ పరిశ్రమలకు కేంద్రం
- 1965 - 70 మధ్య 10 వేల జనాభా
- నేడు 4.5 లక్షల మంది నివాసం

వ్యవసాయం, అనుబంధ వృత్తులు వ్యాపారాలతో గాజువాక వాసులు నివసించేవారు. అలాంటి ప్రాంతం షిప్‌యార్డు ఆవిర్భావం ఏర్పాటుతో పారిశ్రామిక ప్రగతికి పునాది పడింది. ఆ తర్వాత అనేక ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు ఏర్పాటయ్యాయి. ఉమ్మడి ఉత్తరాంధ్ర జిల్లాలతో పాటు రాష్ట్రం, దేశం నలుమూలల నుంచి వచ్చిన వారు అభివృద్ధిలో భాగస్వాములయ్యారు. దీంతో ఈ ప్రాంతం విభిన్న సంస్కృతుల ప్రజలకు ఇది ఆవాసమైంది. అందుకే గాజువాక ఒక మినీ భారత్‌గా కీర్తి కెక్కింది.

ఏనుగులు సంచరించేవట..

గాజువాక పేరు వెనుక ఆసక్తి కరమైన చరిత్ర ఉందని స్థానిక పెద్దలు చెబుతారు.150 ఏళ్ల కిందట గాజువాకలో పెద్ద వాగు ఉండేది. ప్రస్తుత కొత్త గాజువాక నుంచి జింక్ కర్మాగారానికి వెళ్లే మెయిన్ రోడ్డు రెండు కొండలను చీల్చుకొని వెళ్తున్నట్టుగా ఉంటుంది. ఈ రహదారి ఒకప్పుడు వాగుగా ఉండేది. దీంతో ఏనుగులు ఇక్కడ నీళ్ల తాగడానికి, స్నానం చేయడానికి వచ్చేవట. ఏనుగులు స్నానం చేసే ఈ వాగును గజవాగు అనేవారు. అది కాలక్రమంలో గాజువాకగా స్థిరపడిందని పెద్దలు చెబుతారు. ఈ పేరు రావడానికి మరో కథనం కూడా ఉంది. గాజువాకను గజ్‌వాగా పిలిచేవారని చెబుతుంటారు. గజ్‌వా అంటే పర్షియన్ భాషలో పొలిమేర అని అర్థం.

పరిశ్రమలే వికాసానికి పునాది

గాజువాక ఇంతటి అభివృద్ధి సాధించడానికి పారిశ్రామికీకరణే పునాది వేసింది. షిప్‌యార్డ్ ఆవిర్భావంతో ప్రారంభమైన గాజువాక ప్రాంత అభివృద్ధి బీహెచ్‌పీవీ ఏర్పాటుతో వేగవంతమైంది. అనంతర కాలంలో హిందూస్థాన్ జింకు (ప్రస్తుతం ఈ పరిశ్రమ లేదు), హెచ్‌పీసీఎల్ వంటి ప్రభుత్వరంగ పరిశ్రమల ఆవిర్భావంతో పాటు 1970లో ఉక్కు కర్మాగారం వచ్చాక గాజువాక రూపు రేఖలు మారిపోయాయి. స్టీల్‌ప్లాంట్‌తో పాటు షిప్‌యార్డు, బీహెచ్‌ఈఎల్, హెచ్‌పీసీఎల్, బీపీసీఎల్, ఐవోసీఎల్, కోరమాండల్ ఫెర్టిలైజర్స్, హిందూజా పవర్‌ప్లాంట్ ఈ ప్రాంతంలోనే ఉన్నాయి. తూర్పు నౌకాదళం, కోస్ట్ గార్డు హెడ్ క్వార్టర్స్, కూడా ఇక్కడే ఉన్నాయి. భారీ పరిశ్రమలతో పాటు వాటి అవసరాలు తీర్చేందుకు సంబంధించిన చిన్న, మధ్యతరహా పరిశ్రమలు అనేకం ఉన్నాయి. ఈ ప్రాంతంలో సుమారు 1200 చిన్న, మధ్యతరహా పరిశ్రమలున్నాయి.

అత్యధిక తలసరి ఆదాయం

రాష్ట్రంలో అధిక తలసరి ఆదాయం ఉన్న నియోజకవర్గంగా గాజువాక నిలిచింది. 2019–20 ఆంధ్రప్రదేశ్ సోషియో ఎకనామిక్స్ రిపోర్టు ప్రకారం గాజువాక ప్రజల తలసరి ఆదాయం రూ. 2,64,232. 2022–23 సంవత్సరానికి మినిస్ట్రీ ఆఫ్ స్టాటిస్టిక్స్ అండ్ ప్రొగ్రామ్ ఇంప్లిమెంటేషన్ విభాగం లెక్కల ప్రకారం ఇది రూ.2,19,518 కంటే ఎక్కువ. నియోజకవర్గాల వారీగా అభివృద్ధి నివేదికన రూపొందించిన ప్రభుత్వం ఆయా నియోజకవర్గాల్లోని పరిశ్రమలు, సేవలరంగం, వ్యవసాయం, రహదారుల వంటి అంశాలను పరిగణనలోకి తీసుకొని లెక్కించింది. ప్రస్తుత అంచనాల ప్రకారం గాజువాక తలసరి ఆదాయం రూ.3 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకు ఉంటుందని ఆర్థిక నిపుణులు అంచనావేస్తున్నారు.

“అద్భుతమైన అభివృద్ధి



నేను కేరళ రాష్ట్రం నుంచి 1983లో గాజువాక వచ్చాను. అప్పటికి నా వయస్సు 28 సంవత్సరాలు. ప్రస్తుతం నా వయస్సు 69 సంవత్సరాలు. నేను ఇక్కడికి వచ్చి 41 సంవత్సరాలు అయ్యింది. అప్పటికి గాజువాక పంచాయతీగా ఉండేది. ఇక్కడ ఏమీ ఉండేది కాదు. ప్రస్తుతం బాగా పాపులర్ అయిన మంగళగిరి షాపింగ్ కాంప్లెక్స్ స్థలం పిల్లలకు ఆట మైదానంగా ఉండేది. అక్కడికి సమీపంలో ఒక బిల్డింగ్, ఒక చిన్న మెడికల్ షాప్ ఉండేవి. ఇక్కడ ఏవి దొరకాలన్నా కష్టమే. ఇప్పటి గాజువాక మెయిన్ రోడ్డు మార్జిన్ మొత్తం మర్రిచెట్లు, తాటి చెట్లు ఉండేవి. ప్రస్తుతం గాజువాక మహానగరంగా ఎదిగింది. దీనికి కారణం విశాఖ స్టీల్‌ప్లాంట్. ఎన్ని కంపెనీలున్నా ప్లాంట్ ప్రాధాన్యం వేరు. దీన్ని ప్రభుత్వ ఆధ్వర్యంలోనే ఉంచితేనే బాగుంటుంది.

– శశిధరణ్ పిళ్లై, కాంట్రాక్టర్


నిత్యం సందడి

విభిన్న సంస్కృతులు, వారి పండగలతో ఈ ప్రాంతంలో నిత్యం సందడి కనిపిస్తుంది. కేంద్ర, రాష్ట్రాలకు సంబంధించిన పరిశ్రమలు, వాటి అనుబంధ సంస్థలు గాజువాకలో చాలా ఉన్నాయి. దీంతో ఇక్కడ ఉద్యోగాలు, ఉపాధి, వ్యాపారాల కోసం దేశం నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు స్థిరపడ్డారు. దీంతో ఈ ప్రాంతం నిత్యం సందడిగా కనిపిస్తుంది.


పెదగంట్యాడలో ఉత్తర భారతీయుల ఛట్ పూజలు

పల్లె నుంచి పారిశ్రామిక నగరంగా.

1965 నుంచి గాజువాక పేరు వాడుకలోకి వచ్చింది. నిరంతరం జనంతో కిక్కిరిసి ఉండే ప్రస్తుత పాతగాజువాక ప్రాంతాన్ని అంతకుముందు మెట్ట మర్రిపాలెంగా పిలిచేవారు. చట్టివానిపాలెం, అజీమాబాద్, పల్లావారి చేలు, ఉరుకూటివారి కొంపలు ఉన్న ప్రాంతాన్ని అప్పట్లో గాజువాకగా పిలిచేవారు. చినగంట్యాడ పంచాయతీకి పాతగాజువాక శివారు గ్రామంగా ఉండేది. ఆ తర్వాత పాతగాజువాకను చినగంట్యాడ పంచాయతీ నుంచి వేరు చేసి పంతులుగారి మేడ, జోగవానిపాలెం, కొత్త గాజువాకను కలిపి గాజువాక పంచాయతీ చేశారు. 1965 నుంచి 70 నాటికి ఇక్కడి జనాభా కేవలం పదివేలు. ఇప్పుడు నాలుగున్నర లక్షల జనాభాతో గాజువాక జనవాకగా మారిపోయింది.



“గాజువాక అభివృద్ధిని ప్రత్యక్షంగా చూశా



ప్రస్తుతం నా వయస్సు 65 ఏళ్లు. నాడు గాజువాక ప్రాంతం పల్లెటూళ్ల సమాహారం. పంచాయతీలుగా ఉండేది. ఇక్కడ చినగంట్యాడ, గాజువాక, పెదగంట్యాడ, మింది, నాయతయ్యపాలెం పంచాయతీలు ఉండేవి. గాజువాక పంచాయతీకి మా నాన్న చిట్టినాయుడు తొలి సర్పంచ్‌గా పని చేశారు. ఈ ప్రాంతం మొత్తం వ్యవసాయ ఆధారితంగానే ఉండేది. ఇప్పుడు మనం చూస్తున్న పాతగాజువాక జంక్షన్ అప్పట్లో వ్యవసాయమే ఉండేది. మధ్యలో చిన్న రోడ్డు ఉండేది. పాతగాజువాకలో రామాలయం దగ్గర ఒక కిరాణా దుకాణం ఉండేది. అక్కడ అది మూసేస్తే కిలోమీటరు దూరంలో ఉన్న కొత్తగాజువాక వెళ్లాల్సి వచ్చేది. అప్పట్లో గాజువాకకు రెండు ఆర్టీసీ బస్సులుండేవి. అవి ఎక్కాలన్నా కొత్త గాజువాక వెళ్లాల్సిందే. ఆ తర్వాత బీహెచ్‌పీవీ, జింక్, హెచ్‌పీసీఎల్, కోరమాండల్ వంటి పరిశ్రమలు వచ్చాయి. దీంతో ఇతర ప్రాంతాల నుంచి జనం వలస రావడం బాగా పెరిగింది. స్టీల్‌ప్లాంట్‌వల్ల ఈ ప్రాంతం బాగా అభివృద్ధి చెందింది. నా కళ్ల ముందే గాజువాక అత్యధిక జనాభా గల ప్రాంతంగా అభివృద్ధి చెందింది.

– ఉరుకూటి అప్పారావు, మాజీ కార్పొరేటర్

క్లుప్తంగా

సబ్ రిజిస్ట్రార్ బాధ్యతల స్వీకరణ


టి.తారకేష్

అక్కిరెడ్డిపాలెం: గాజువాక సబ్ రిజిస్ట్రార్‌గా టి.తారకేష్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కొత్తవలస సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తిస్తూ బదిలీపై వచ్చారు. ఇక్కడి సబ్ రిజిస్ట్రార్‌గా విధులు నిర్వర్తించిన కె.రాజు నెల్లిమర్ల సబ్ రిజిస్ట్రార్‌గా బదిలీపై వెళ్లారు.

అవగాహనతోనే ఎయిడ్స్ నియంత్రణ


ఎయిడ్స్ పై అవగాహన కల్పిస్తున్న యాక్సెప్ట్ సభ్యులు

పెదగంట్యాడ: అవగాహనతోనే ఎయిడ్స్‌ను నియంత్రించ వచ్చని యాక్సెప్ట్ ప్రొగ్రాం మేనేజర్ అనిల్ తెలిపారు. స్టీల్ ప్లాంట్ బీసీ గేట్ వద్ద యాక్సెప్ట్ మైగ్రాంట్ ఆధ్వర్యంలో మంగళవారం ఎయిడ్స్‌పై స్టీల్‌ప్లాంట్ కార్మికులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, దాని నివారణ విధానాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు.

పొంచి ఉన్న ప్రమాదం


సర్వీసు రోడ్డులో ప్రమాదకరంగా గొయ్యి

అక్కిరెడ్డిపాలెం: షీలానగర్ నుంచి అక్కిరెడ్డిపాలెం వైపు వచ్చే సర్వీసు రోడ్డు ప్రమాదకరంగా మారింది. రాత్రి వేళ ఈ గోతిలో పడి పలువురు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఈ మార్గంలో లారీలు రాకపోకలు సాగిస్తుండడంతో రోడ్డు పూర్తిగా ధ్వంసం అయి భారీగా గొయ్యి ఏర్పడింది. అధికారులు వెంటనే స్పందించి గొయ్యిపూడ్చి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

నేటి నుంచి పవిత్రోత్సవాలు


కల్యాణ వేంకటేశ్వరస్వామి

అగనంపూడి: జీవీఎంసీ 79వ వార్డు అగనంపూడి శాంతినగర్ కాలనీలోని శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో నేటి నుంచి 29వ తేదీ వరకు పవిత్రోత్సవాలు గా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. 26న వసుంధరా దేవి శిష్య బృందంతో సంగీత కచేరి, 27న సాయంత్రం లక్ష కుంకుమార్చన, 28న లక్ష తులసి పూజ జరిపించనున్నట్టు కమిటీ చైర్మన్ ఈకే చారి తెలిపారు.

దంత వైద్య శిబిరానికి స్పందన


దంత వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

గాజువాక: జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) దినోత్సవంలో భాగంగా స్థానిక ఎంవీఆర్ డిగ్రీ కళాశాలలో మంగళవారం దంత వైద్య శిబిరం నిర్వహించారు. వి.డెంటల్ కేర్ సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరంలో విద్యార్థులు, అధ్యాపకులకు దంత వైద్య పరీక్షలు నిర్వహించారు. దంత సంరక్షణపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ వి.రామారావు, ప్రిన్సిపాల్ ఎ.బాలకృష్ణ, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్లు ఎస్.వి.కృష్ణ, ఎస్.కె.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

హెచ్‌ఆర్‌ఏ సర్క్యులర్ రద్దు చేయాలి

ఐఎన్‌టీయూసీ ధర్నా


స్టీల్‌ప్లాంట్ ఈడీ బిల్డింగ్ వద్ద బైఠాయించిన ఐఎన్‌టీయూసీ నాయకులు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ కార్మికులకు హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ.ఎల్‌టీఏ నిలిపివేస్తూ జారీ చేసిన సర్క్యులర్‌ను రద్దు చేయాలని స్టీల్ ఐఎన్‌టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. నాయకులు, కార్యకర్తలు ఈడీ (వర్క్స్) బిల్డింగ్ ప్రవేశ ద్వారం వద్ద మంగళవారం ధర్నా చేశారు. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు.యూనియన్ అధ్యక్షుడు నీరుకొండ రామచంద్రరావు మాట్లాడుతూ నూతన వేతనాలు అమలు కాక కార్మికులు ఇబ్బందులు పడుతుంటే చాలదన్నట్టు హెచ్‌ఆర్‌ఏ, ఎల్‌టీసీ, ఎల్‌టీఏ నిలిపివేయడం దుర్మార్గమన్నారు. ఈ చర్యలు కార్మికులను రెచ్చగొట్టే విధంగా ఉన్నాయని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న ఒప్పందాన్ని ఉల్లంఘించి కార్మికుల క్వార్టర్ కరెంటు చార్జీలు యూనిట్ రూ.8కు పెంచడం అన్యాయమన్నారు. అనంతరం సీజీఎం(వర్క్స్) యు. శ్రీధర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకుల కారురమణ, రమణమూర్తి, ఎస్.ఎ.నాయుడు, సుబ్బయ్య, కొమ్ము ప్రసాద్, ప్రభాకరరెడ్డి, డి.మోహన్, పి.వి. నగేష్, ఈశ్వరరావు, మద్ది అప్పలరాజు పాల్గొన్నారు.

ఐక్య ఉద్యమాలతో ఉక్కు పరిరక్షణ


దీక్షా శిబిరంలో పాల్గొన్న కార్మికులు

అగనంపూడి: ఐక్య ఉద్యమాలతో విశాఖ ఉక్కును కాపాడుకుంటామని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ చైర్మన్ డి.ఆదినారాయణ అన్నారు. విశాఖ ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీల ఆధ్వర్యంలో కూర్మన్నపాలెంలో చేపట్టిన 1321వ రోజు రిలే దీక్షా శిబిరంలో ఆయన మాట్లాడారు. భవిష్యత్‌లో కార్మిక సంఘాలను ఐక్యం చేసి వారి సహకారంతో విశాఖ ఉక్కు పరిరక్షణ ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. స్టీల్‌ప్లాంట్ సంక్షోభానికి కేంద్రప్రభుత్వం వైఖరి కారణమన్నారు. కొంతమంది ఉన్నతాధికారులు విశాఖ ఉక్కు కర్మాగారంపై కక్ష కట్టి నాశనం చేశారన్నారు. కేంద్ర పాలకులు, యాజమాన్య వైఖరి వల్ల వేలాది మంది కార్మికులు రోడ్డున పడే పరిస్థితి ఏర్పడిందన్నారు. దీక్షా శిబిరంలో ఎస్ఎంఎస్–2, క్యూ ఎటీడీ, టీఏ, వీఎస్ఈహెచ్ విభాగాల కార్మికులు పాల్గొన్నారు. నాయకులు కిడిమి రాజబాబు, జె.నరేష్ కుమార్, చీకటి శ్రీనివాసరావు, జగదీష్, కరణం పైడిరాజు, వరప్రసాద్, సతీష్, ఇందల శివకుమార్, దాసరి శ్రీనివాసరావు తదితరులు సంఘీభావం తెలిపారు.

సత్తా చాటిన అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు


పలు క్రీడల్లో విజయం సాధించిన బాలికలు


విజయం సాధించిన బాలురతో ఉపాధ్యాయులు

అక్కిరెడ్డిపాలెం: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో గాజువాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో నిర్వహించిన పలు క్రీడల్లో 68వ వార్డు అక్కిరెడ్డిపాలెం విద్యార్థులు సత్తా చాటారు. ఖోఖోలో బాల, బాలికలు జట్లు విన్నర్స్‌గా, షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో బాలికలు జూనియర్ విభాగంలో రన్నర్స్‌గా, చెస్ పోటీల్లో జూనియర్స్ విభాగంలో రన్నర్స్‌గా నిలిచారు. షటిల్ బ్యాడ్మింటన్ పోటీల్లో సీనియర్ విభాగంలో బాలురు విన్నర్స్‌గా, చెస్‌లో రన్నర్స్‌గా నిలిచారని స్కూల్ పీడీ ఇస్మాయిల్ తెలిపారు. విజేతలను పాఠశాల హెచ్ఎం ఎం.ఎల్.ఎస్.కాంతం, ఉపాధ్యాయులు కుమారస్వామి, దేముళ్లు, ఉషారాణి, నాగేశ్వరరావు తదితరులు అభినందించారు.

కుట్రపూరిత చర్యలు విడనాడాలి

సీతమ్మధార: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సాగిస్తున్న కుట్రపూరిత చర్యలను విడనాడాలని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ పార్కులో ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలు 1277వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్‌ను ప్రైవేటీకరించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక కుట్రపూరిత చర్యలకు పాల్పడుతున్నాయని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే రూ. 11 వేల కోట్లు వర్కింగ్ క్యాపిటల్‌గా కేటాయించాలన్నారు. స్వచ్ఛంద పదవీ విరమణ పథకాన్ని నిలిపేయాలని, ఇతర స్టీల్‌ప్లాంట్లకు కార్మికులను బదిలీ చేసే చర్యలను ఆపేయాలని కోరారు. కూటమి నాయకులు ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. గంగవరం పోర్టును ప్రభు త్వం వెంటనే స్వాధీనం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రొఫెసర్ సూరప్పుడు, ఐఎఫ్‌టీయూ నాయకుడు వై.కొండయ్య, జిల్లా అధ్యక్షుడు కె.మల్లయ్య, తిరుపతిరావు, భూషణం తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలకు కుర్చీల అందజేత


కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్‌కు కుర్చీలు అందిస్తున్న ఆశాలత

అగనంపూడి: అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పది ప్లాస్టిక్ కుర్చీలను మంగళవారం ఆశారాజ్ షైనింగ్ సొసైటీ ప్రతినిధి ఆశాలత అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్ బాబు, గుమ్మడి వరప్రసాద్, మోటూరి వెంకరమణ, శివ నాగేశ్వరరావు, కిరణ్‌దాసన్, నవీన్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ‘ఏబీఎస్’ సహాయం

అగనంపూడి: విజయవాడ వరద బాధితులకు జీవీఎంసీ 85వ వార్డు అగనంపూడి సమీపంలోని ఏబీఎస్ పాఠశాల యాజమాన్యం వంద గ్యాస్ స్టవ్‌లు, మరో వంద మందికి ప్రజర్ కుక్కర్లు అందించి ఉదారత చాటుకున్నారు. కార్యక్రమంలో పాఠశాల ట్రస్ట్ వ్యవస్థాపకులు పీ.ఎం. కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

అనాథ శవానికి అంతిమ సంస్కారాలు

గాజువాక: మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులు గాజువాకలో ఒక అనాథ శవానికి అంతిమ సంస్కారాలు నిర్వహించారు. గాజువాక పోలీసుల సమక్షంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. గాజువాక ఎస్ఐ లంక సూర్య కళ, మానవతా సంస్థ సభ్యులు దీనంకొండ కృష్ణంరాజు, పూట శ్రీనివాసరావు, బలివాడ సత్యారావు, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

27న యూనియన్ బ్యాంకు ఉద్యోగుల సమ్మె


సీతమ్మధార యూనియన్ బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు

సీతమ్మధార : సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 27న యూనియన్ బ్యాంకు ఉద్యోగులు, అధికారుల సంఘం చేపట్టిన సమ్మెను విజయవంతం చేయాలని సంఘం నాయకులు సీతమ్మధారలోని బ్యాంకు ప్రాంతీయ కార్యాలయం వద్ద మంగళవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ యూనియన్ బ్యాంకు ఎంప్లాయీస్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఉదయ కుమార్ మాట్లాడుతూ బ్యాంకుల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్ట్ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగులపై పని ఒత్తిడి తగ్గించాలని, అప్రెంటిస్ నియామకాలు నిలిపివేయాలని డిమాండ్ చేశారు. రీజినల్ కార్యదర్శి వసంతరావు, సాగర్, శ్రీనివాస్, ప్రత్యూష, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భవనాల్లోకి సచివాలయాలు

ఆర్డీవో హుస్సేన్ సాహెబ్


కొండయ్యవలస వార్డు సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాబ్

అగనంపూడి: విశాఖ ఆర్డీఓ హుస్సేన్ సాబ్ మంగళవారం 85వ వార్డు కొండయ్యవలస వార్డు సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ల్యాండ్ పూలింగ్ భూములు, వాటి రికార్డులు పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు భవనాల్లో కొనసాగుతున్న వార్డు సచివాలయాలను ఖాళీగా ఉన్న ప్రభుత్వ భవనాల్లోకి తరలించాలని వార్డు సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. అలాగే త్వరలో ఫార్మాసిటీ లేఅవుట్‌ను పరిశీలిస్తామన్నారు. గాజువాక తహసీల్దార్ శ్రీవల్లి మాట్లాడుతూ అగనంపూడిలో ఇసుక డిపో ఖాళీ చేశామని.. సదరు స్థలాన్ని తిరిగి స్టీల్‌ప్లాంట్‌కు అప్పగించనున్నట్టు తెలిపారు. సచివాలయాల్లో ఎలాంటి దరఖాస్తులు పెండింగ్‌లో ఉండడానికి వీల్లేదని ఆమె ఆదేశించారు.

ఆ పాఠశాలలను విశాఖలోకి మార్చండి

గాజువాక మండల పరిధిలో ఉంటూ పరవాడ మండల విద్యాశాఖ ఆధీనంలో కొనసాగుతున్న పాఠశాలలను వెంటనే విశాఖ జిల్లాలోకి మార్చాలని పలువురు అధికారులను కోరారు. కొత్తూరు, డొంకాడలో పాఠశాలల భవనాలు అందుబాటులో ఉన్నాయని, వాటిని చిన్నపాటి మరమ్మతులతో వార్డు సచివాలయాలుగా మార్చాలని నాయకులు బి.సత్యనారాయణ, చందు రమేష్, అచ్యుత్ కోరారు.

మానిటరింగ్ కమిటీని రాష్ట్ర వ్యాప్తంగా వేయాలి

ఉక్కునగరం: ఇటీవల అచ్యుతాపురం ఎస్ఈజెడ్‌లో జరిగిన ప్రమాదంపై రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన సెంట్రల్ ఇన్‌స్పెక్షన్ మానిటరింగ్ కమిటీ (సీఐఎంసీ)ను రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయాలని స్టీల్‌ప్లాంట్ గుర్తింపు సంఘం ఎఐటీయూసీ అధ్యక్షుడు కె.ఎస్.ఎన్. రావు డిమాండ్ చేశారు. మంగళవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అచ్యుతాపురం ఎస్ఈజెడ్ సంఘటనపై కమిటీ ఏర్పాటు చేయడం హర్షణీయమన్నారు. ఎస్ఈజెడ్ మాత్రమే కాకుండా అనేక ప్రభుత్వ, ప్రైవేటు పరిశ్రమలు, సంస్థలకు కూడా వర్తించేలా రాష్ట్ర వ్యాప్తంగా కమిటీ వేయాలని డిమాండ్ చేశారు.

స్టీల్‌ప్లాంట్‌తో సహా ఇతర అన్ని ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో భద్రతా ఏర్పాట్లు, వాటి పర్యవేక్షణ ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. సమావేశంలో చీకటి శ్రీనివాస్, డి. నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు నియోజకవర్గ ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీలు


మాట్లాడుతున్న ఎస్‌జీఎఫ్ నియోజకవర్గ కోఆర్డినేటర్ మన్నాజీ

అగనంపూడి: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) గాజువాక నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీలు బుధవారం గాజువాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్వహించనున్నట్టు నియోజకవర్గ కోఆర్డినేటర్ ఎం.మన్నాజీ, పాఠశాల హెచ్ఎం విజయప్రశాంతి, పీడీ రత్నం చెప్పారు. కణితి హైస్కూల్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ మండల స్థాయి పోటీల్లో ఎంపిక చేసిన జట్లను ఈ పోటీలకు పంపించాలని సూచించారు.